# మార్పు

- డా. షహనాజ్ బతుల్



"హాల్‌టిక్కెట్టు చూపించు" అడిగారు విశ్వంగారు. హాల్ టిక్కెట్టు కంపాస్ బాక్స్‌లో నుంచి తీయబోతున్నాడు కామేశం. కాని విశ్వంగారి చూపు వేరే చోట వుంది.

సూర్యారావు తన కాలి బూటు తీశాడు. బూటు పట్టుకొని, లోపలికి చెయ్యి పెట్టి చూశాడు. తనని విశ్వంగారు గమనించడం లేదనుకున్నాడు.

కాని విశ్వంగారు హాల్ టిక్కెట్టు చెక్ చేస్తూ తననే గమనిస్తున్నారన్న సంగతి తెలియదు.

బూటులో తనకు కావాల్సిన వస్తువు దొరక్క ఆందోళన పడుతుంటే, విశ్వంగారు తనలో తానే నవ్వుకున్నారు.

అతను పరీక్ష రాయలేకపోతున్నాడు. అసలు బూటులో పెట్టిన వస్తువు ఎలా పోయింది? పోయే అవకాశం లేదే. బూటు తన కాలికే తొడిగి వుంది.

విశ్వంగారు సంతకాలు చెయ్యడం, హాల్ టిక్కెట్లు చెక్ చెయ్యడం పూర్తి చేసి, వెళ్ళి ఒక కుర్చీలో కూర్చున్నారు.

రెండో ఇన్విజిలేటర్ గోపాలం గారు వెనకాల ఆబ్జెంట్ అయిన స్టూడెంట్ సీటులో కూర్చున్నారు.

విద్యార్థులు అతనిలాంటి ఇన్విజిలేటర్లు రావాలని కోరుకుంటారు. కాపీ కొడుతున్నా పట్టించుకోరు.

కాని విశ్వంగారు చాలా స్ట్రిక్ట్. విద్యార్థులను కొద్దిగా కూడా తల త్రిప్పనివ్వరు.

విశ్వంగారు సూర్యారావునే గమనిస్తున్నారు. అతనేం రాయలేకపోతున్నాడు.

కొంతసేపయ్యాక మనోహర్ లేచి "సార్ కాలిక్యులేటర్ కావాలి" అన్నాడు.

"నేనిక్కడ కాలిక్యులేటర్లు సప్లై చెయ్యడం లేదు" అన్నారు.

"సూర్యం దగ్గర తీసుకుంటాను."

"సరే తీసుకో!"

మనోహర్ సూర్యారావుని కాలిక్యులేటర్ అడిగాడు. అతను మాట్లాడకుండా మౌనంగా అందించాడు.

మనోహర్ కాలిక్యులేటర్ తీసుకుని, జిప్ ఓపెన్ చేసి, కాలిక్యులేటర్‌ని బయటకు తీశాడు. లోపల ఏమీ కనిపించలేదు. రెండు, మూడు బటన్స్ నొక్కి మళ్ళీ అతనికే అందిస్తూ 'రాస్కెల్' అన్నాడు అతనికి మాత్రమే వినిపించేటట్లు.

సూర్యారావు ఏదో రాస్తూనే వున్నాడు. కాని మనోహర్ పరీక్ష పేపర్ ఇచ్చేసి బయటకు వచ్చాడు.

అందరి కంటే ఆఖర్న సూర్యం పేపరు ఇచ్చాడు. నిజానికి పరీక్ష బాగా రాయలేదు. మనస్సంతా వ్యాకులతతో నిండి వుంది. జీవితంలో మొదటిసారి ఇటువంటి ఓటమి.

మనోహర్, సూర్యారావులు ప్రాణస్నేహితులు. ఏమి చేసినా ఇద్దరూ కలిసే చేస్తారు. మనోహర్ తనని అపార్థం చేసుకున్నందుకు బాధగా వుంది. "పరీక్ష ఎలా రాశావు?" సూర్యం ప్రక్కకు తిరిగాడు.

విశ్వంగారు తనకి కొద్ది దూరంలో నిల్చుని అడుగుతున్నారు.

"బాగా రాయలేదు సర్!"

"బాగా రాయలేదని బాధ పడవద్దు. రేపటి పరీక్ష బాగా రాయి. విష్ యు ఆల్ ద బెస్ట్" అని చెప్పి వెళ్ళిపోయారు.

"థ్యాంక్యు సర్!"

సూర్యం ఒక చెట్టు క్రిందకు వెళ్ళి కూర్చున్నాడు. వెంటనే ఇంటికి వెళ్ళాలనిపించలేదు.

తన తల్లి తనకు ఏ లోటూ లేకుండా పెంచింది. తనకు ఏం జరిగినా సహించలేదు.

ఎంత సేపు అలా కూర్చున్నాడో తెలియదు. అందరూ వెళ్ళిపోయారు. ఇక ఇంటికి వెళ్దామని లేచాడు. కొన్ని అడుగులు వేసి ఆగిపోయాడు.

ఎదురుగా కళ్ళల్లో నిప్పులు కక్కుతూ మనోహర్ నిల్చుని వున్నాడు.

ఏదో చెప్పాలని వుంది. కాని నోరు పెగలటం లేదు.

ఫట్ ఫట్ ఫట్...అతని చెంపలు పేలిపోయాయి. తను ఒకప్పుడు రౌడీలా ఎంతోమందిని కొట్టినవాడే.

కాని ఇప్పటి పరిస్థితి వేరు. ప్రతిఘటించే శక్తి లేదు. తనను కొడుతున్న వ్యక్తి తన ప్రాణ స్నేహితుడు.

రాస్కెల్ నన్నే మోసం చేస్తావురా అంటూ పిడికిలి బిగించి కడుపులో గుద్దాడు.

"అబ్బా..." సూర్యారావు క్రింద పడిపోయాడు. అతని చొక్కా పట్టుకుని లేపాడు మనోహర్.

సూర్యారావు చేతులు రెండూ జోడించాడు వదలమన్నట్లు.

"నిన్ను వదిలిపెట్టాలా? నమ్మకద్రోహి, మిత్ర ద్రోహి, వంచకుడివి..."

అపార్థం చేసుకున్న వ్యక్తి ఆవేశంలో ఉన్నప్పుడు నిజం చెప్పినా నమ్మడు.

అలా అనుకుని మౌనంగా ఊరుకుంటే ఆ వ్యక్తికి నిజం తప్పక తెలుస్తుంది. పశ్చాత్తాపానికి మించిన శిక్షలేదు.

తల్లి మాటలు గుర్తుకు వచ్చి, మౌనం వహించాడు. మనోహర్ కొట్టి,కొట్టి వెళ్ళిపోయాడు. సూర్య స్పృహ తప్పాడు.

ముఖం మీద చల్లటి నీళ్ళు పడితే లేచాడు. చీకటి పడుతుంది. నీళ్ళు చల్లిన వ్యక్తి వాచ్‌మెన్. లేవబోయాడు. కాని నరాల్లో మెలి తిప్పిన బాధ.

"అబ్బా..." అన్నాడు.

"ఏమైంది? ఎవరైనా కొట్టారా?"

ఔనని తల ఊపి మంచి నీళ్ళు కావాలని చెప్పాడు. మంచి నీళ్ళందించాడు వాచ్‌మెన్. మంచి నీళ్ళు త్రాగాక వాచ్‌మెన్ సహాయంతో బస్టాప్‌కి వచ్చి బస్సెక్కాడు.

* * *

"ఏమైందిరా? ఏమైంది?" కొడుకుని చూసి ఆదుర్దాగా అడిగింది అన్నపూర్ణమ్మ.

"ఏమీ లేదమ్మా" అంటూ గదిలోకెళ్ళి మంచం మీద వాలాడు.

"ఏమీ లేదంటావేమిటి? ఈ గాయాలేమిటి?" కొడుకు దగ్గరకు వచ్చి అడిగింది.

.................

"వేడి నీళ్ళు కాపడం పెడ్తానుండు" అంటూ వేడి నీళ్ళు తేవటానికి వెళ్ళింది.

"పూర్ణా! వాడెందుకు ఆలస్యంగా వచ్చాడట?" భర్త అడిగేసరికి ఏమి జవాబు చెప్పాలో తెలియక అయోమయంగా నిల్చుంది.

"నీ గారాబమే వాడ్ని అలా తయారు చేసింది. చావనీ వాడ్ని" రెండు కన్నీటి బిందువులు చెంపల మీదుగా జారాయి.

నారాయణ, అన్నపూర్ణలకు సూర్యారావు ఒక్కడే కొడుకు. లేక లేక పుట్టిన కొడుకు. చాలా గారాబంగా పెంచుతున్నారు. అన్నపూర్ణకు కొడుకంటే ప్రాణం. ఏది కావాలంటే అది తెచ్చిచ్చేది. బాగా గారాబం చేసేసరికి కొడుకు అల్లరిగా రౌడీలా తయారైపోయాడు. నారాయణ మాత్రం చాలా గంభీరంగా ఉంటారు.

అందుకే తండ్రంటే భయం. ఏది కావాలన్నా సూర్యారావు తల్లినే అడుగుతాడు. నారాయణ సూర్యారావు వున్న గదిలోనికి వచ్చాడు.

"ఏరా! ఎవరు కొట్టారు?"

" నా క్లాస్‌మేట్!"

"ఎందుకు కొట్టాడు?"

............................

"చెప్పరా నీ తప్పేమీ లేకుండానే కొట్టాడా?"

.............................

తను బాగా చదవడని, కాపీ కొడతాడనీ, రౌడీల గ్యాంగులో ఉన్నాడని, తండ్రి నమ్మకం. ఏమి జవాబు చెప్పగలడు?

"ఈ రోజు పరీక్ష ఎలా రాశావు?"

"బాగా రాయలేదు."

ఇంకేమీ ప్రశ్నించకుండా వెళ్ళిపోయారు. అన్నపూర్ణమ్మ కొడుక్కు వేడి నీళ్ళు కాపడం పెట్టింది.

* * *

సూర్యారావు బి.టెక్.పూర్తయ్యింది.

బి.ఆర్.ఇలో మంచి పర్సంటేజ్ వచ్చింది. స్టేట్స్‌కి వెళ్ళడానికి ఎయిడ్ వచ్చింది. అందరూ ఆశ్చర్యపోతున్నారు. రౌడీ గ్యాంగులో ఉన్న వ్యక్తి, కాపీలు కొట్టే విద్యార్థి స్టేట్స్‌లో సీటు రావడం, ఎయిడ్ రావడం ఏమిటి అని.


కాని అతన్ని బాగా గమనించిన వాళ్ళు మాత్రం అతనిలో మార్పు గమనించారు. అటువంటి వాళ్ళల్లో ముఖ్యులు విశ్వంగారు.

సూర్యారావు గోల్డు మెడలు విద్యార్థి కాకపోయినా, మంచి విద్యార్థి. ఇంటర్ వరకూ బాగానే చదివాడు. ఓపెన్ మెరిట్‌లో బి.టెక్‌లో సీటు వచ్చింది.

మొదటి సంవత్సరం బాగానే చదివాడు. ఆ తర్వాత మనోహర్‌తో స్నేహం ఏర్పడింది. అతనొక పేరు మోసిన రౌడీ. చదవడు.కాపీ కొడ్తాడు.

ఎటువంటి వాళ్ళతో స్నేహం చేసినా బలహీనులే తొందరగా లొంగిపోతారు. అటువంటి బలహీనత సూర్యారావులో వుంది. కాబట్టి మనోహర్‌కి లొంగిపోయాడు.

వంతులు వేసుకుని, కాపీలు తెచ్చేవారు. ఆ రోజు స్లిప్ తెచ్చే వంతు సూర్యారావుది. కాలి



బూటు లోపల స్లిప్ పెట్టి తెచ్చాడు. కాని పరీక్ష హాల్లో కనిపించలేదు. అందుకే మనోహర్ కొట్టాడు.

ఇంకెప్పుడూ కాపీ కొట్టనని తల్లికి మాట ఇచ్చాడు. అప్పట్నుంచి కష్టపడి చదివాడు.

కానీ మనోహర్‌తో అప్పట్నుంచి, ఇప్పటి వరకూ మాటలు లేవు. ఆ రోజు స్లిప్ ఎలా పోయిందో ఎవ్వరికీ తెలియదు.

భారతదేశం వదిలి వెళ్ళబోతున్నాడు. మెమోల కోసం, టి.సిల కోసం, ఆటోలో స్టాఫ్ చేత సంతకాలు చేయించుకోవడం కోసం వచ్చాడు.

విశ్వంగారి వద్దకు వచ్చి "సార్! నేను స్టేట్స్‌కి వెళ్ళబోతున్నాను" అన్నాడు.

"మంచిది బాబూ! ఎప్పుడు బయల్దేరుతున్నావు?"

"రేపే సార్!"

"విష్‌యు ఆల్ ది బెస్ట్. నా దీవెనలు నీకు ఎప్పుడూ ఉంటాయి."

"థ్యాంక్యూ సర్! ఆటోలో సంతకం చెయ్యండి సర్!"

ఆటో ఇచ్చాడు.

ఆటోలో సంతకం చేసి ఇస్తూ "సూర్యం నీతో కొంచెం మాట్లాడాలి."

"చెప్పండి సార్!"

"పద అలా బయటకెళ్దాం".

సార్‌ని అనుసరించాడు.

"సూర్యం నేనేం చేసినా విద్యార్థుల క్షేమం కోరే చేస్తాను. నాకు నీ మీద కోపం ఏ మాత్రం లేదు?"

"సార్!"

నేను చెప్పేది విను. కొంతమంది విద్యార్థులు ముందు నుంచి బాగా చదివి అధ్యాపకుల మన్ననలను పొందుతారు.

అందులో రెండు రకాలు. బలవంతులు, బలహీనులు.

బలవంతులు స్నేహితుల ప్రభావానికి లొంగరు. అటువంటి వాళ్ళకు రౌడీ గ్యాంగు దూరంగా వుంటుంది.

బలహీనులు లొంగిపోతారు. వాళ్ళు తమ కెరీర్‌ను పాడు చేసుకుంటారు.

ఉద్యోగంలో చేరాక బాధ్యతలు చేపట్టాక తెలుసుకుంటారు. పద అలా లాన్‌లో కూర్చుందాం."

ఇద్దరూ లాన్‌లోకెళ్ళి కూర్చున్నారు.

"రౌడీలకు లొంగిన వాళ్ళు మళ్ళీ మంచి వాళ్ళుగా మారితే మళ్ళీ ఎప్పుడూ ఎవ్వరూ వాళ్లని చెడగొట్టలేరు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే...నీవూ బలహీనుడివే."

సూర్యం ఎక్కసారి తల ఎత్తి మళ్ళీ దించుకున్నాడు. నీకు నా మీద కోపం రాదంటే ఒక విషయం చెబుతాను.

"సార్! నాకు మీమీద కోపం రాదు సర్!"

"నువ్వు బి.టెక్ రెండో సంవత్సరంలో ఉన్నప్పుడు నేను ఒకసారి గుడికి వెళ్ళాను. గుడి బయట చెప్పులు వదిలేటప్పుడు నా కళ్ళు ఒక బూటు మీద పడ్డాయి. ఎందుకంటే ఆ బూటులో నుండి ఒక కాగితం బయటకు కనిపిస్తోంది. అక్షరాలు కనిపించాయి. అది బూటు అని ఆలోచించకుండా తీశాను. అది ఒక స్లిప్."

సూర్యంకి కొద్దిగా అర్థమౌతోంది.

"బూటు లోపల స్లిప్ పెట్టుకొని పరీక్షకి వెళ్తున్న విద్యార్థి ఎవరో తెలుసుకోవాలన్న కుతూహలం కల్గింది. ఆ విద్యార్థి బయటకు వచ్చి, బూటు తొడుగుతుంటే చూశాను. ఆ విద్యార్థి ఎవరో కాదు, నువ్వే. అప్పుడు మీకు పరీక్షలు జరుగుతున్నాయి".

సూర్యానికి అన్నీ గుర్తుకు వస్తున్నాయి. ఆ రోజు స్లిప్ కనిపించకపోవడం మనోహర్ తనను కొట్టడం.తను మారడం.

"ఇదీ సూర్యం నేను చేసిన తప్పు. ఆ స్లిప్ తీసుకున్నాను. ఈ విషయం నీ ఇంజనీరింగ్ పూర్తయ్యి వెళ్ళే ముందు చెబుదామనుకున్నాను."

"సార్! నేను మీకు రుణపడి వున్నాను. ఆ రోజు మీరు ఆ స్లిప్ తీసుకోకపోతే అలాగే కాపీలు కొడుతూ...సప్లిమెంటరీలు రాసుకుంటూ ఉండేవాడిని. ఈ పాటికి బి.టెక్ డిగ్రీ వచ్చేది కాదు. మీరు నాలో మార్పు రావడానికి దోహదం చేశారు సార్!"

"పద బాబు వెళ్దాం!"

ఇద్దరూ లేచారు.

"థ్యాంక్యూ సర్! మిమ్మల్ని నేను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. నాకు మీ ఆశీస్సులుంటే చాలు సార్!"

"నా ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉంటాయి. నీ శ్రేయస్సు కోరుకునే వ్యక్తిని నేను. నీలోమార్పు రావడం గమనించి, చాలా సంతోషించాను."

"థ్యాంక్యూ వెరీ మచ్ సర్! రేపే నా ప్రయాణం. మళ్ళీ ఇండియా వచ్చినప్పుడు తప్పక కలుస్తాను. బై సార్!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

విశ్వంగారి కళ్ళల్లో సన్నటి కన్నీటి తెర కమ్ముకుంది. బాధగా అనిపించింది. సూర్యం వెళ్తున్నందుకు కాదు.

ఒక విద్యార్థిలో మార్పు రావడానికి దోహదం చేసినందుకు సంతోషము.

'పండిత పుత్ర: పరమశుంఠ' అనిపించుకున్న రౌడీల్లా చెలామణి అవుతున్న తన ఇద్దరు కుమారులను మార్చలేక పోయినందుకు బాధ.

ఆయనకే తెలియదు.కాని సూర్యం మారినందుకు ఆయనకు తృప్తిగా సంతోషంగా వుంది.

విద్యార్థులు కూడా నా కొడుకుల్లాంటి వాళ్ళేగా అనుకుని, తృప్తిగా అక్కడ నుంచి కదిలారు.

❃

